క్లుప్తంగా

స్థానిక ఎన్నికల్లో 50 శాతం ముదిరాజ్‌లను కేటాయించాలి

చిలప్‌చెడ్(నర్సాపూర్): రానున్న స్థానిక ఎన్నికల్లో 50 శాతం వరకు ముదిరాజ్‌లకు కేటాయించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు హనుమంతు అన్నారు. మంగళవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అధిక సంఖ్యలో బీసీ వర్గ ప్రజలే ఉన్నారని, అందులో 70 శాతం ముదిరాజులే ఉన్నారన్నారు. అధిక సంఖ్యలో ముదిరాజులు ఉన్నందున, వారికే స్థానిక ఎన్నికల్లో పాల్గొనేందుకు ఎక్కువ శాతం రిజర్వేషన్లు కేటాయించాలన్నారు.

నోట్ బుక్స్, బ్యాగుల పంపిణీ



విద్యార్థులకు నోట్ బుక్స్, బ్యాగులు అందిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని రత్నపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అక్షయ ఫౌండేషన్ చేయూతనందించింది. మంగళవారం పాఠశాలలోని విద్యార్థులందరికీ నోట్ బుక్స్, బ్యాగులు, స్టేషనరీ సామగ్రి అందజేశారు. విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని ఉన్నత స్థాయి ఎదగాలని ఈ సందర్భంగా అక్షయ ఫౌండేషన్ సభ్యులు సురేశ్‌యాదవ్, మహేశ్, సాయి, భాను, పవన్, మింటు, రోహిత్ తో పాటు తదితరులు అన్నారు.

ఫర్నిచర్ అందజేత



చేగుంట పల్లె దవాఖానకు ఫర్నిచర్ అందజేస్తున్న పరంజ్యోతి

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంటలోని స్టేషన్ రోడ్డు పల్లెదవాఖానకు దాత అయిత పరంజ్యోతి మంగళవారం ఫర్నిచర్ అందజేశారు. కంప్యూటర్ టేబుల్‌తో పాటు కుర్చీలు అందించగా, డాక్టర్ అనిల్‌కుమార్ దాతను కొనియాడారు. అనంతరం ప్రభుత్వ వైద్య సేవలను వినియోగించుకోవాలని ప్రజలను ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ కిషన్, సిబ్బంది కిరణ్‌కుమారి, నాగమణి, హమాలీ సంఘం నాయకుడు వెంకటి, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం



బచ్చురాజ్‌పల్లిలో వరి కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న అధికారులు

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని బచ్చురాజ్‌పల్లి గ్రామంలో మంగళవారం రామాయంపేట సొసైటీ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సొసైటీ డైరెక్టర్ రమావత్ లక్ష్మి మాట్లాడుతూ.. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సెక్రటరీ దుర్గారెడ్డి, గ్రామ కార్యదర్శి రాములు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనులను గుర్తించాలి: ఎంపీడీఓ



గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు

చిన్నశంకరంపేట(మెదక్): ఉపాధిహామీ పథకం ద్వారా వచ్చే వార్షిక సంవత్సరంలో నిర్వహించే పనులను గుర్తించాలని నార్సింగి ఎంపీడీఓ ఆనంద్ అన్నారు. మంగళవారం నార్సింగి గ్రామ పంచాయతీ ఆవరణలో గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే ఆర్థిక సంవత్సరంలో నిర్వహించేందుకు వార్షిక ప్రణాళిక రూపకల్పనకు గ్రామసభలు నిర్వహించి, పనులు గుర్తిస్తున్నట్లు తెలిపారు. ఈజీఎస్ ఏపీఓ రాజేశ్వర్, ఈఓ నాగభూషణం పాల్గొన్నారు.

అందరి కృషితోనే ఆర్టీసీ అభివృద్ధి : పవన్

గజ్వేల్‌రూరల్: ఆర్టీసీ అభివృద్ధిలో ఉద్యోగులు, సిబ్బంది భాగస్వాములై గజ్వేల్–ప్రజ్ఞాపూర్ డిపోను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని డిపో మేనేజర్ పవన్ కోరారు. రాఖీ పౌర్ణమి, దసరా పండుగల సందర్భంగా అత్యధిక ఆదాయాన్ని సమకూర్చడంలో భాగస్వాములైన ఉద్యోగులకు మంగళవారం స్టీల్ వాటర్ బాటిళ్లను అందజేసి అభినందించారు.

సమస్యలు పరిష్కరించాల్సిందే

- తపస్ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా లక్ష్మణ్
- నల్ల బ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన



పెద్దశంకరంపేటలో ఉపాధ్యాయుల నిరసన

చేగుంట(తూప్రాన్): ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని తపస్ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా లక్ష్మణ్ అన్నారు. మంగళవారం మధ్యాహ్న విరామ సమయంలో తపస్ సంఘం ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ.. సీపీఎస్ రద్దుతో పాటు పెండింగ్ డీఏలు చెల్లించి పీఆర్సీని ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 317 జీఓతో నష్టపోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తపస్ సంఘం నాయకులు వెంకటేశ్, కృష్ణమూర్తి, ప్రభాకర్, సుమతి, శ్రీనివాస్, రేఖ, రేవతితో పాటు పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టీపీయూఎస్ ఆధ్వర్యంలో..

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని రాంపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టీపీయూఎస్ జిల్లా ఉపాధ్యక్షురాలు సుకన్య ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలతో ఉపాధ్యాయులు మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 317 జీవోలో నష్టపోయిన ఉపాధ్యాయులను స్థానిక జిల్లాలకు కేటాయించాలన్నారు. అలాగే పెండింగ్ డీఏలను వెంటనే ప్రకటించాలన్నారు. నూతన పీఆర్‌సీను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఈశ్వరయ్య, అర్జున్, నరేష్, చంద్రకాంత్, షాదుల్ పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన డీఏలు, పీఆర్సీ, తదితర పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని మండల టీపీయూఎస్ అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని గౌతాపూర్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన చేశారు.

రాయిలాపూర్ ఉన్నత పాఠశాలలో..

కౌడిపల్లి(నర్సాపూర్): ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు ప్రభుత్వం వెంటనే చెల్లించాలని టీపీయూఎస్ జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. రాయిలాపూర్ ఉన్నత పాఠశాలలో భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పెండింగ్ బిల్లులు, డీఏ, పీఆర్‌సీ వెంటనే చెల్లించాలన్నారు. దీంతోపాటు ముత్రాజ్‌పల్లి ఉన్నత పాఠశాలలో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఫహీం, నరేందర్‌గౌడ్, రవిప్రసాద్, అనుష, శకుంతల, బబ్బు, రమేశ్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



చేగుంటలో నిరసన వ్యక్తం చేస్తున్న తపస్ సంఘం నాయకులు



నిజాంపేట(మెదక్): రాంపూర్‌లోని పాఠశాలలో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

పెద్దశంకరంపేటలో..

పెద్దశంకరంపేట(మెదక్): ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తపస్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి తమ నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తపస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుజ్జరి రవి, కాన్షీరాం జాదవ్, ఉపాధ్యాయులు రాజేశ్వర్, మారుతి, రాణి, భారతి, ఉషారాణి, సుధీర్, రాధక్రిష్ణ, గోపి, ప్రసన్న, సాయాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పాపన్నపేటలో..

పాపన్నపేట(మెదక్): పెండింగ్ బిల్లులను చెల్లించాలని ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో తపస్ మండలాధ్యక్షుడు మంగనర్సింలు, పాఠశాల హెచ్ఎం మహేశ్వర్, ఉపాధ్యాయులు వెంకటేశం, అంజాగౌడ్, ప్రవీణ్, కృష్ణ కాంత్, రమేశ్, యాదయ్య, వేణుగోపాల్ రెడ్డి, మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి

హవేళిఘణాపూర్(మెదక్): తపస్ మెదక్ మండలాధ్యక్షుడు నరేందర్ ఆధ్వర్యంలో ఆయా పాఠశాలలో మధ్యాహ్న భోజన సమయంలో ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుల్తానా, రవి, శంకర్‌రెడ్డి, శ్రీనివాస్, దేవేందర్‌రెడ్డి, శంకర్, లలిత, యేసు, శీతల్, జ్వాల పాల్గొన్నారు.

పీఆర్సీని వెంటనే ప్రకటించాలి

తూప్రాన్: రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న పీఆర్సీలను వెంటనే ప్రకటించాలని తపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవాత్ సురేష్ అన్నారు. జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో జిల్లా అధ్యక్షుడే ఎల్లంతో కలిసి నల్లబ్యాడ్జీలతో ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో తపస్ నాయకులు చక్రవర్తి, వేణు, సంజీవ్, హెచ్ఎం ప్రసన్న వదన, ప్రభాకర్, నటరాజన్ పాల్గొన్నారు.



తూప్రాన్‌లో నిరసన తెలుపుతున్న తపస్ ఉపాధ్యాయ సంఘం నాయకులు

తప్పనిసరిగా టీకాలు వేయించాలి

- పశు సంవర్ధకశాఖ ఏడీ జనార్దన్‌రావు

కౌడిపల్లి(నర్సాపూర్): పశువులకు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి సోకకుండా నివారణ టీకాలు వేయించాలని నర్సాపూర్ ఏడీ డాక్టర్ జనార్దన్‌రావు అన్నారు. మంగళవారం మండలంలోని దేవులపల్లి కోమటికుంటతండా, సామ్యతండాల్లో పశువులకు గాలికుంటు వ్యాధినివారణ టీకా కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పశుపోషకులు తమ పశువులకు వ్యాధి నివారణకు టీకాలు తప్పనిసరిగా వేయించాలన్నారు. టీకాలు వేయడం వల్ల పాలదిగుబడి తగ్గుతుందనడం సరికాదని అపోహలు నమ్మొద్దని చెప్పారు. టీకాలు వేస్తే పశువులకు వ్యాధి సోకదన్నారు. వైద్యసిబ్బంది ప్రతి రోజు మందులు, టీకాల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజు, జేవీఓ సుదర్శన్, వీఏ చెన్నయ్య, సిబ్బంది సుజాత, రైతులు పాల్గొన్నారు.

పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలి

చిలప్‌చెడ్(నర్సాపూర్): ముందస్తు జాగ్రత్తగా పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసే కార్యక్రమాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని వెటర్నరీ అసిస్టెంట్ ఇబ్రహీం అన్నారు. మంగళవారం ఆయన సిబ్బందితో కలసి మండలంలోని జగ్గంపేట గ్రామంలోని పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఇబ్రహీం మాట్లాడుతూ.. గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయడం వల్ల పశువులు ఆరోగ్యంగా, బలంగా తయారవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది శంకర్, అరవింద్, గ్రామస్తులు పాల్గొన్నారు.



కౌడిపల్లి(నర్సాపూర్): కోమటికుంట తండాలో పశువులకు టీకాలు వేస్తున్న ఏడీ జనార్దన్‌రావు

తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది

ఎమ్మెల్యే రోహిత్‌రావు



మెదక్‌జోన్: రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు తెలిపారు. మంగళవారం మెదక్ జిల్లాలో ఎంత మేర ధాన్యం తడిసిందో వ్యవసాయశాఖ అధికారులు నివేదికలను సిద్ధం చేస్తున్నారని చెప్పారు. రైతులు ఎవరు దిగులు చెందొద్దని ఆయన సూచించారు.

అసిస్టెంట్ కుక్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

దుబ్బాకటౌన్: రాయపోల్ మండల కేంద్రంలో కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ కుక్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఎంఈఓ సత్యనారాయణరెడ్డి తెలిపారు. 300 మందికి పైగా వంట చేయగల సామర్థ్యం కలిగి ఉండి, ఏడో తరగతి చదివిన వారు అర్హులని చెప్పారు. దరఖాస్తులను ఈనెల 23 నుంచి 29లోగా పాఠశాలలో అందజేయాలని కోరారు.

దరఖాస్తుల పరిశీలన

దౌల్తాబాద్(దుబ్బాక): మండలంలో గత ప్రభుత్వ హయాంలో ఎల్ఆర్ఎస్‌కు వచ్చిన దరఖాస్తులను మండల గిర్దావార్ ఇరిగేషన్ ఏఈ దాసరి సుమన్ మంగళవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం 200 దరఖాస్తులు రాగా వాటిలో సుమారు 30 దరఖాస్తులు పరిష్కరించామని, త్వరలోనే మిగిలిన వాటిని కూడా పరిష్కరిస్తామన్నారు.

సమస్యలపై పోరాడుతాం

దుబ్బాకటౌన్: ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ నాన్‌గెజిట్ ఉద్యోగుల సంఘం నిరంతరం పోరాడుతుందని టీఎన్‌జీఓ జిల్లా ఉపాధ్యక్షుడు మురళి అన్నారు. మంగళవారం దుబ్బాకలో ఉద్యోగుల సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయం, తహసీల్దార్, మున్సిపల్, పలు ప్రభుత్వ కార్యాలయాల్లో సభ్యత్వాలు నమోదు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సభ్యులందరికీ అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు.

రవీందర్ సేవలు మరువలేనివి

టేక్మాల్(మెదక్): మండలంలో లక్ష్మణ్ తండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు రవీందర్ సేవలు మరువలేనివని కాంప్లెక్స్ హెచ్ఎం అమరేందర్‌రెడ్డి అన్నారు. బదిలీ అయిన ఉపాధ్యాయుడు రవీందర్‌ను చంద్రు తండా గ్రామ తాజా మాజీ సర్పంచ్ స్రవంతి సర్దార్ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థుల తల్లిదండ్రులు నాయకులతో కలిసి సన్మానించారు. అనంతరం ఎంబీబీఎస్ సీట్లు సాధించిన విద్యార్థులు గ్రామానికి చెందిన నిఖిల్, సంపత్ కుమార్‌లను సన్మానించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్ఎంలు బాల్యానాయక్, దయానంద్‌రెడ్డి, దుర్గయ్య, లక్ష్మణ్ తండా పాఠశాల ఉపాధ్యాయురాలు మనిరేఖ, మోహన్, పీఏసీఎస్ డైరెక్టర్ చందర్, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



రవీందర్‌ను సన్మానిస్తున్న విద్యార్థులు, తండావాసులు

సంక్షిప్త వార్తలు

◆ పాఠశాలకు ప్రహరీ నిర్మించండి

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని బండపోసాన్‌పల్లి ఉన్నత పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని సీపీఎం ఏరియా కమిటీ నాయకుడు గౌరి, వ్యకాస జిల్లా సభ్యుడు నరేందర్ డిమాండ్ చేశారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రహరీ లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు వాపోయారు.

◆ సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

శివ్వంపేట(నర్సాపూర్): పేద, మధ్య తరగతి కుటుంబాల కోసం ప్రభుత్వం అందిస్తున్న సీఎంఆర్ఎఫ్ ఎంతగానో ఉపయోగపడుతుందని జిల్లా ఎంపీపీ ఫోరం మాజీ అధ్యక్షుడు హరికృష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు యాదిరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, మదన్‌నాయక్, వెంకటేష్, రాజు, ఆంజనేయులు, సాయిలు, తదితరులు ఉన్నారు.

◆ ట్రాక్టర్‌ను ఢీకొన్న ఆటో, ఇద్దరికీ గాయాలు

అల్లాదుర్గం(మెదక్): ట్రాక్టర్‌ను వెనక నుంచి ఆటో ఢీకొనడంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని పల్లేగడ్డ శివారులో 161 జాతీయ రహదారిపై మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. టేక్మాల్ మండలం ఎల్లుపేటకు చెందిన కుమార్ ఆటోలో వట్‌పల్లి మండలం పోతులబోగుడ గ్రామానికి వెళ్లి.. తిరిగి వస్తుండగా ట్రాక్టర్‌ను వెనక నుంచి ఆటో ఢీకొంది. దీంతో ఆటో డ్రైవర్ కుమార్, అందులో ప్రయాణిస్తున్న గట్టుపల్లికి చెందిన గోపాల్‌కు చేయి విరిగి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని 108 అంబులెన్స్‌లో జోగిపేట ఆస్పత్రికి తరలించారు.

పట్టభద్రులు దరఖాస్తు చేసుకోవాలి

మనోహరాబాద్(తూప్రాన్): ఎమ్మెల్సీ ఎన్నికల కోసం పట్టభద్రులు, ఉపాధ్యాయులు ఓటు నమోదు చేసుకోవాలని మండల తహసీలాదర్ చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని పలు గ్రామాల్లో బూత్ లెవల్ అధికారితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా ఫారం 18, 19పై అవగాహన కల్పించారు. గ్రామాల్లో ఉన్న పట్టభద్రులు అర్హులైన ప్రతీ ఒక్కరికి సమాచారం ఇవ్వాలని బీఎల్ఓలకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీటి కౌశిక, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి

బీజేపీకి మద్దతివ్వాలి

నర్సాపూర్: డిగ్రీ పూర్తి చేసిన పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నిక కోసం తమ పేర్లను నమోదు చేసుకొని బీజేపీకి మద్దతివ్వాలని మంచిర్యాల జిల్లా బీజేపీ అధ్యక్షుడు రఘోత్తంరావు కోరారు. ఆయన మంగళవారం పలువురు బీజేపీ నాయకులతో కలిసి పట్టణంలోని బీవీ రాజు ఇంజనీరింగు కాలేజీతో పాటు పలు పాఠశాలల్లో పర్యటించి ఉపాధ్యాయులను తమ పేర్లు పట్టభద్రుల ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. తమ పార్టీకి మద్దతివ్వాలని కోరారు. ఆయన వెంట బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మురళీయాదవ్, రఘువీరారెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేశ్‌గౌడ్, పార్టీ నాయకులు రమణరావు, మల్లేశ్‌గౌడ్, ఆంజనేయులుగౌడ్, ప్రేంకుమార్ తదితరులు పాల్గొన్నారు.



నర్సాపూర్‌లోని పాఠశాలలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

108 అంబులెన్స్‌లో మహిళ ప్రసవం

- అంబులెన్స్‌లో తల్లీబిడ్డ క్షేమం



చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రానికి చెందిన లావణ్య పురిటినొప్పులతో బాధపడగా... ఆస్పత్రికి తరలించేందుకు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. మంగళవారం తెల్లవారు జామున గర్భిణిని 108 సిబ్బంది మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా.. పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో ఈఎంటీ రమేశ్ అంబులెన్స్‌లోనే మహిళకు ప్రసవం చేయగా, ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లిబిడ్డను మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దీంతో అంబులెన్స్ ఈఎంటీ రమేశ్, పైలెట్ సురేశ్‌ను అధికారులు అభినందించారు.

ఏఐఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నేడు కలెక్టరేట్ ముట్టడి

మెదక్ మున్సిపాలిటీ: పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దినకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మెదక్‌లో దినకర్ మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఫీజు రీయింబర్స్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు.

పరిశోధనలు అధ్యాపకులకు చాలా అవసరం

- ప్రిన్సిపాల్ డా.హుస్సేన్

మెదక్ కలెక్టరేట్: పరిశోధనలు అధ్యాపకులకు చాలా అవసరమని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హుస్సేన్ అన్నారు. మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రసాయన శాస్త్ర అధ్యాపకుడిగా పనిచేస్తున్న వేణుగోపాల్‌రావుకు డాక్టరేట్ వచ్చింది. ఈ సందర్భంగా మంగళవారం కళాశాలలో ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డా.హుస్సేన్ మాట్లాడుతూ.. పరిశోధన రంగంలో కళాశాల అధ్యాపకులు కృషి చేస్తున్నందుకు ప్రశంసించారు. పరిశోధనలు వ్యక్తిగతంగా, కేరీర్ పరంగా అధ్యాపకులకు చాలా అవసరమని తెలిపారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టి నేటికి ఏడాది పూర్తి చేసుకున్న ప్రిన్సిపాల్‌కు అధ్యాపకులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.



డాక్టరేట్ పొందిన అధ్యాపకుడు వేణుగోపాల్‌రావును సన్మానిస్తున్న ప్రిన్సిపాల్

అమరవీరుల త్యాగాలు మరువలేనివి



పెద్దశంకరంపేటలో సైకిల్ ర్యాలీలో పాల్గొన్న సీఐ రేణుకారెడ్డి

పెద్దశంకరంపేట(మెదక్): విధి నిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగాలు మరువలేనివని అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి అన్నారు. మంగళవారం పెద్దశంకరంపేటలో పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమంలో భాగంగా పోలీసులు, విద్యార్థులతో కలిసి సైకిల్ ర్యాలీలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. శాంతిభద్రతలకు ప్రజలు పోలీసులకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో పేట ఎస్ఐ శంకర్, అల్లాదుర్గం ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి, రేగోడ్, టేక్మాల్ ఎస్ఐలు, ఏఎస్ఐ సునీత, సిబ్బంది శంకర్, సుధీర్, రాజు, రమేశ్, మల్లేశం తదితరులు ఉన్నారు.

పోలీసుల ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ

నర్సాపూర్: పోలీసు అమర వీరుల దినాన్ని పురస్కరించుకొని మంగళవారం నర్సాపూర్‌లో సైకిల్‌ర్యాలీ నిర్వహించారు. సీఐ జాన్‌రెడ్డి, ఎస్ఐ లింగం ఆధ్వర్యంలో పలు పాఠశాలల విద్యార్థులు, పోలీసులు సైకిలు ర్యాలీలో పాల్గొన్నారు.

విద్యారంగ అభివృద్ధికి పెద్దపీట

గజ్వేల్‌రూరల్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యారంగ అభివృద్ధికి పెద్దపీటవేసి ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసిందని మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ సర్దార్‌ఖాన్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేసిందన్నరు. కార్యక్రమంలో నర్సింహారెడ్డి, రాములు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధి శిక్షణతో ఉద్యోగాలు

జహీరాబాద్ టౌన్: నైపుణ్యాభివృద్ధి శిక్షణతో మంచి ఉద్యోగాలు వస్తాయని టాస్క్ ట్రైనర్ ప్రవీణ్ అన్నారు. పట్టణంలోని ఆచార్య డిగ్రీ కళాశాల విద్యార్థులకు తెలంగాణ అకాడమి ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్(టాస్క్) ఆధ్వర్యంలో మంగళవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రైనర్ మాట్లాడుతూ.. పోటీ ప్రపంచంలో పలు మల్టీ నేషనల్ కంపెనీల్లో ఉద్యోగాలు సంపాదించాలంటే ఇంటర్వ్యూ, స్కిల్స్ ముఖ్యమన్నారు. శిక్షణతో విద్యార్థుల నైపుణాభివృద్ధి పెంపొందుతున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ చింతల హరికుమార్, డైరెక్టర్లు వెంకట్‌రాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కళాశాల టాస్క్ కోఆర్డినేటర్ నర్సింలు, అధ్యాపకులు నిఖిత, దీపక, నందుగౌడ్, నవీన, శ్వేతతో పాటు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టాస్క్ ట్రైనర్ ప్రవీణ్